క్లుప్తంగా

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో సాయినాథుడు

రాజంపేట టౌన్ : మండలంలోని కూచివారిపల్లెలో వెలసిన సాయిబాబా ఆలయ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబా మూలవిరాట్‌ని ప్రత్యేక పుష్పాలతో, పట్టువస్త్రాలతో శోభాయమానంగా అలంకరించారు. వేకువజాము నుంచే విశేష పూజలను ప్రారంభించి రాత్రి వరకు పూజలు చేశారు. సాయంత్రం నిర్వహించిన పల్లకీ సేవలు భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఆలయ వార్షికోత్సవంలో భక్తులు తరలివచ్చారు. దీంతో కూచివారిపల్లె ప్రాంతంలో జాతర వాతావరణం కనిపించింది. పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులకు నిర్వాహకులు ఉదయం అల్పాహారం , మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

ఇరుముడి పూజలు



శబరిమలై వెళ్లేందుకు సిద్ధమైన మాలధారులు

సిద్దవటం : మండల కేంద్రానికి చెందిన అయ్యప్ప మాలధారులు ఆదివారం స్వామి వారి ఇరుముడి పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సిద్దవటం గ్రామ శివారులో వెలసిన ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం మాలధారులు నెల రోజులపాటు కఠోర దీక్ష, నిష్ఠతో దీక్ష బూని స్వామివారికి పూజలు జరిపారు. దీక్షను విరమించడానికి ఇరుముడి కట్టుకొని శబరిమలైలోని అయ్యప్ప స్వామిని దర్శించుకునేందుకు ప్రత్యేక వాహనంలో బయలు దేరారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్ఆర్‌సీపీ మండల యూత్ కన్వీనర్ ఆలం క్రిష్ణచైతన్య, వి.పుల్లయ్య, మాలధారుల కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

మంత్రి పెద్దిరెడ్డికి ఘన స్వాగతం



మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి స్వాగతం పలుకుతున్న నాయకులు

గాలివీడు : మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి మండల ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. ఆదివారం సత్యసాయి జిల్లాలో పార్టీ కార్యక్రమాల్లో పాల్గొని తిరిగి తిరుపతికి వెళ్తుండగా మార్గ మధ్యలో గాలివీడులో పుష్పగుచ్ఛాలను అందించి సన్మానించారు. ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో అందరూ కలిసి నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డిని గెలపించాలని కోరారు.

ప్రతి ఇంటికి శ్రీరాముడి అక్షింతలు



అక్షింతలను ర్యాలీగా తీసుకువస్తున్న భక్తులు

ఓబులవారిపల్లె : మండలకేంద్రంలోని ఆంజనేయస్వామి దేవస్థానానికి అయోధ్య శ్రీరామ పూజిత అక్షింతలు ఆదివారం చేరాయి. శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో అక్షింతలను గ్రామ మహిళలు కోలాటం ఆడుతూ భక్తి శ్రద్ధలతో గ్రామంలోని కటికంవారిపల్లె శ్రీ కృష్ణ మందిరానికి చేర్చారు. ఈ సందర్భంగా ట్రస్టు సభ్యులు మాట్లాడుతూ మండలంలోని ఇరవై రెండు పంచాయతీలకు అక్షింతలను పంపిణీ చేస్తామన్నారు. అక్కడి నుంచి ప్రతి ఇంటికి శ్రీరాముడి చిత్రపటంతోపాటు అక్షింతలను అందిస్తామని పేర్కొన్నారు. అయోధ్యలో జనవరి 22న శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠ అత్యంత వైభవంగా జరుగుందని కావును ప్రతి ఇంటిలో స్వామి వారి అక్షింతలు ఉండే విధంగా ట్రస్ట్ ద్వార పంపిణీ చేస్తున్నామని తెలియపరిచారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

చింతకొమ్మదిన్నె : కడప నగర సమీపంలోని ఆర్టీఏ కార్యాలయం వద్ద ఉన్న అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అన్నమాచార్య విద్యా సంస్థల అధినేత చొప్పా గంగిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో జరగాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ సుధాకర్‌రెడ్డి, సమావేశ కోఆర్డినేటర్ డాక్టర్ కె.వి.నాగేశ్వర్ రెడ్డి, అన్ని విభాగాల హెచ్‌ఓడీలు, కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సైనికుల్లా పనిచేయాలి

వలంటీర్లకు దుస్తులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి



వలంటీర్లకు దుస్తులు పంపిణీ చేస్తున్న రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడి

వీరబల్లి (రాయచోటి టౌన్) : గ్రామ వలంటీర్లు జగనన్న సైనికుల్లా పని చేయాలని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. ఈనెల 21వ తేదీన సీఎం జగన్ మోహన్‌రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకొని వలంటీర్లకు దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్ల ద్వారా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేరుగా ప్రజలకు సంక్షేమ ఫలాలు అందిస్తున్నారని చెప్పారు. ఆ ఫలాలు ప్రజలకు అందే విధంగా వలంటీర్లు చేస్తున్న సేవలు చాలా గొప్పవన్నారు. వచ్చే ఎన్నికల్లో జగనన్నకు తోడుగా ఉండి మీపై పెట్టుకున్న నమ్మకానికి అనుగుణంగా పని చేయాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలను గెలిపించుకొని మళ్లీ జగనన్నే సీఎంగా చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శివరాం గౌడ్, వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ఉమామహేశ్వర రాజు, మండల నాయకులు కుళ్లాయిరెడ్డి, వీఆర్ వెంకట్రామిరెడ్డి, గాలివీటి వీరనాగిరెడ్డి, జిల్లా బీసీ సంఘం అధ్యక్షులు మోడం నాగభూషణం, ఈఓపీఆర్డీ రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే గాలివీటి విశ్వనాథరెడ్డి వర్ధంతి వేడుకల్లో మేడా

లక్కిరెడ్డిపల్లె మాజీ ఎమ్మెల్యే గాలివీటి విశ్వనాథరెడ్డి 7వ వర్ధంతి వేడుకల్లో రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి పాల్గొని ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆదివారం గాలివీటి సోదరులు మాజీ ఎంపీపీ గాలివీటి విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీపీ రాజేంద్రనాథరెడ్డి, మురళీ మోహన్‌రెడ్డిల ఆధ్వర్యంలో నిర్వహించిన వర్ధంతి వేడుకలలో ఆయన పాల్గొన్నారు. విశ్వనాథరెడ్డి చేసిన ప్రజా సేవను కొనియాడారు. అనంతరం పేదలకు అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు.

కుక్కలదొడ్డి గ్రామంలో జెడ్పీ చైర్మన్ ఆకేపాటిని కలిసిన ఎమ్మెల్యే

రాజంపేట : జిల్లా సరిహద్దు ప్రాంతమైన కుక్కలదొడ్డిలో ఆదివారం రాత్రి శ్రీవారి భక్తులకు రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి ఆధ్వర్యంలో అన్నప్రసాదాలను వితరణ చేయించారు. కుక్కలదొడ్డిలో ఏర్పాటు చేసిన అన్నదాన్న శిబిరంలో జెడ్పీ చైర్మన్ సోదరుడు ఆకేపాటి అనీల్ రెడ్డితో కలిసి శ్రీవారి భక్తులకు అన్నప్రసాదాన్ని స్వయంగా వడ్డించారు. అనంతరం ఆకేపాటిని కలిసి అన్నమయ్య కాలిబాట పాదయాత్ర వివరాలను, తిరుమలకు చేరే సమయాలను అడిగి తెలుసుకున్నారు. శ్రీవారి భక్తులకు అన్నప్రసాదాలను అందించడం మహాభాగ్యంగా భావిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో కడప డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పోలి మురళీ, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎం.గంగిరెడ్డి, పాలగిరి మల్లికార్జున రెడ్డి, సత్యాల రామకృష్ణ, పుల్లంపేట విజయకుమార్ రెడ్డి, కుందానెల్లూరు వెంకటేశ్వరరెడ్డి, సౌమ్యనాథ ఆలయ మాజీ చైర్మన్ అరిగెల సౌమిత్రి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రాజంపేట: కుక్కలదొడ్డి వద్ద పాదయాత్ర బృందానికి అన్న ప్రసాదాలు వడ్డిస్తున్న ఎమ్మెల్యే మేడా

ప్రత్యేక పూజలందుకున్న అమ్మవార్లు



పూజలందుకుంటున్న అనంతపురం గంగమ్మ

లక్కిరెడ్డిపల్లె : శ్రీ అనంతపురం గంగమ్మ దేవత ఆదివారం భక్తులచే పూజలు అందుకుంది. చుట్టుపక్కల ప్రాంతాల నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణమంతా భక్తులతో పోటెత్తింది. ఆలయ ప్రత్యేకాధికారి రవీందర్ రాజు భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశారు. ఆలయ పూజారులు అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు జరిపి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మొక్కులు ఉన్న భక్తులు బోనాలు సమర్పించి తలనీలాలు అర్పించారు.

చిన్నమండెంలో..



అలంకరణలో మల్లూరమ్మ

చిన్నమండెం : మండల పరిధిలోని మల్లూరు గ్రామంలో వెలసిన శ్రీ మల్లూరమ్మకు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం కావడంతో అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. అనంతరం ఆలయ అర్చకులు పలు పూజలను నిర్వహించారు. మొక్కులు ఉన్న భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి బంధుమిత్రులతో కలిసి విందును ఆరగించారు.

సంబేపల్లెలో..



ప్రత్యేక అలంకరణలో నల్లగంగమ్మ

సంబేపల్లె : మండల పరిధిలో వెలసిన నల్ల గంగమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు అమ్మవారికి విశేష పూజలు జరిపి ప్రత్యేకంగా అలంకరించారు. వేకువజాము నుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకొని టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

అంగన్‌వాడీల సమ్మెను విరమింపజేయాలి



అంగన్‌వాడీల సమ్మెకు మద్దతునిచ్చి ధర్నాలో పాల్గొన్న ప్రజాసంఘాల నేతలు

రాయచోటి అర్బన్ : సమస్యలను వెంటనే పరిష్కరించడం ద్వారా అంగన్‌వాడీల సమ్మెను విరమింపచేయాలని ప్రజాసంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం రెవెన్యూ కార్యాలయం వద్ద ఉన్న అంబేడ్కర్ చిత్రపటం వద్ద అంగన్‌వాడీలు నిర్వహించిన ధర్నాకు ప్రజాసంఘాల నేతలు మద్దతునిచ్చి ధర్నాలో పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీలు చేపట్టిన ఆందోళన కార్యక్రమాలకు పాలకులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. అంగన్‌వాడీలకు జీతాలు పెంచకుండా, బిల్లులు చెల్లించకుండా పస్తులు పెట్టడం ద్వారా వారంతట వారే ఉద్యోగాలను మానుకునేలా చేయడమే ప్రభుత్వ విధానంగా కనిపిస్తోందంటూ ఆరోపించారు. అంగన్‌వాడీలు నోటీసులు ఇచ్చి సమ్మె చేస్తుంటే పాలకులు సచివాలయం ఉద్యోగులతో అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగులకొట్టడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. పాలకులు ఇప్పటికైనా స్పందించి అంగన్‌వాడీ ప్రాజెక్టుల నిర్వహణకు పెద్దమొత్తంలో నిధులను విడుదల చేయడంతోపాటు కార్యకర్తలు, ఆయాల జీతాలు పెంచాలంటూ డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ యూనియన్‌ల నేతలు భాగ్యలక్ష్మి, సిద్దమ్మ, మస్రూన్‌బీలు మాట్లాడుతూ పాలకులు గర్భిణులు, బాలింతలు, పిల్లల సంక్షేమం, ఆరోగ్యం పట్ల శ్రద్ధవుంటే కోడిగ్రుడ్లు, పాలు, సన్నబియ్యంతో కూడిన పౌష్టికాహారాన్ని అందజేసేవారన్నారు. అంగన్‌వాడీలను కాపాడుకోవలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నేతలు ఈశ్వర్, రామాంజనేయులు, తాతయ్య, రమేష్‌బాబు, పామయ్య, న్యాయవాది నాగముని, అంగన్‌వాడీ సంఘం నేతలు బంగారు పాప, ఖాజాబీ, సబీనా, గౌసియా, రాములమ్మ, సునీత, స్వప్నతోపాటు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

సంబేపల్లెలో నిరసన

సంబేపల్లె : అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు తలపెట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా ఆదివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. కనీస వేతనాలు పెంచాలని, యాప్‌ల భారాన్ని తగ్గించాలని, రిటైర్మెంట్ అలవెన్సులు కల్పించాలని కోరుతూ వారు నిరసన వ్యక్తం చేశారు.

పద్మశాలీల అభ్యున్నతికి కృషి చేద్దాం



మాట్లాడుతున్న పుత్తూరు చంద్రశేఖర్

రాయచోటి టౌన్ : సమస్యలను మన పోరాటం ద్వారానే పరిష్కారం అవుతాయని అందుకు అందరూ ఐక్యంగా ఉండాలని కువైట్ పద్మశాలీ అసోసియేషన్ వ్యవస్థాపకులు, అధ్యక్షులు పుత్తూరు చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం రాయచోటి పట్టణ పరిధిలోని సుద్దలవాండ్ల పల్లె రోడ్డులో ఉన్న శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆలయంలో పద్మశాలి వెల్ఫేర్ అసోసియేషన్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పద్మశాలీలు అందరూ ఏకతాటి పైకి వచ్చి సామాజికవర్గం అభ్యున్నతికి ముందుకు రావాలన్నారు. పద్మశాలీ కుటుంబాలలో నిరుపేద విద్యార్థులు ఉన్నా, అనాథ పిల్లలు ఉన్నా అలాంటి వారి ఉన్నత చదువుల కోసం, ఉన్నతి కోసం తాము సహకరిస్తామని చెప్పారు. అలాగే వెల్ఫేర్ అసోసియేషన్ ఉన్నతి కోసం తనవంతు కృషి చేస్తామన్నారు. అనంతరం అన్నమయ్య జిల్లా పద్మశాలీ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా పురుషోత్తం పద్మశాలీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దువ్వూరు నరసింహాచారి పాల్గొన్నారు.

పెన్షన్ భిక్ష కాదు మన హక్కు



సీనియర్ పెన్షనర్స్‌ను సన్మానిస్తున్న సభ్యులు

రాయచోటి టౌన్ : పెన్షన్ అనేది భిక్ష కాదు అది మన హక్కుని పెన్షనర్స్ అసోసియేషన్ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు పీసీ రెడ్డెన్న అన్నారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని ఎన్‌జీఓ హోంలో నేషనల్ పెన్షనర్స్ డే నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 30 - 40 సంవత్సరాలు నిర్విరామంగా ప్రభుత్వం చేపట్టే అనేక కార్యక్రమాలను ప్రజలకు చేరవేస్తూ ఉద్యోగులు ఎనలేని సేవ చేస్తే రిటైర్డ్ అయిన తరువాత వచ్చేదే పెన్షన్ అన్నారు. అలాంటి ఉద్యోగులు శేషజీవితం ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, ఆనందంగా జీవించేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలని చెప్పారు. పెన్షన్ ప్రతి నెల 1వ తేదీనే అందేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. అనంతరం 70 సంవత్సరాలు దాటిన సీనియర్ పెన్షనర్స్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఎన్‌జీఓ ప్రెసిడెంట్ వెంకటేశ్వరరెడ్డి, న్యాయాధికారి రెడ్డి కుమార్, రిటైర్డ్ తహసీల్దార్ మల్లికార్జున రావు, పెన్షనర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు రమణ, ప్రధాన కార్యదర్శి ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు



శ్రీదేవి భూదేవి సమేత మహావిష్ణు మూలవిరాట్

రామాపురం : ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని ఈ నెల 22 శుక్రవారం నుంచి 24వ తేదీ వరకు బండపల్లె వద్ద ఉన్న కంభరాయుడిగుట్టపై వెలసిన శ్రీ దేవి భూదేవి సమేత మహావిష్ణు దేవస్థానంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ధర్మకర్త బసిరెడ్డి ఆదివారం తెలిపారు. 22న ఉదయం గంగా నయనం, గోపూజ, యాగశాల ప్రవేశం, శ్రీ మహాగణపతి పూజ స్వస్తి, అఖండ దీపారాధన, ప్రధాన దేవత కలశస్థాపన ఆరాధన మూలమూర్తులకు అభిషేకాలు, అలంకరణ, నైవేద్యం, మహా మంగళ హారతి తీర్థప్రసాదాల వినియోగం, సాయంత్రం ప్రదోష పూజలు, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ట, మహా సుదర్శన యాగం, నవగ్రహ వస్త్రా హోమం, మంగళహారతి, తీర్థప్రసాదాలు అందిస్తామన్నారు. 23న వైకుంఠ ఏకాదశి సందర్భంగా తెల్లవారుజామున మూలమూర్తుల ఉత్సవాలకు సుప్రభాత సేవ అభిషేకం, ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు మహావిష్ణు దర్శనం ఇస్తారన్నారు. 24న శ్రీదేవి భూదేవి సమేత మహావిష్ణువు కల్యాణోత్సవం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలుతోపాటు ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరవుతారన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకొని స్వామి కృపకు పాత్రులు కావాలని తెలియజేశారు.

రాష్ట్ర సుభిక్షతకే తిరుమల మహా పాదయాత్ర

- రైల్వేకోడూరులో జెడ్పీ చైర్మన్ ఆకేపాటి పాదయాత్ర బృందానికి ఘనస్వాగతం
- పాల్గొన్న ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, కొల్లం గంగిరెడ్డి, నాయకులు



ఆకేపాటి వెంట పాదయాత్రలో పాల్గొన్న విప్ కొరముట్ల, నాయకులు

రైల్వేకోడూరు అర్బన్ : ఉమ్మడి వైఎస్సార్ జిల్లా జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి చేస్తున్న 21వ తిరుమల మహా పాదయాత్ర బృందానికి పట్టణంలో ఆదివారం ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి తదతరులు ఘన స్వాగతం పలికారు. పట్టణ సరిహద్దులలో గజ మాలతో సత్కరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సీడీ నాగేంద్ర అతిథి గృహంలో పాదయాత్ర బృందానికి అల్పాహార విందు ఏర్పాటు చేశారు. అలాగే కొల్లం గంగిరెడ్డి ఆధ్వర్యంలో శెట్టిగుంట వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహించారు. అనంతరం పూజలు ముగించుకొని పాదయాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆకేపాటి మాట్లాడుతూ ఎంతో మహత్యం కలిగిన కలియుగ దైవం తిరుమల వెంటేశ్వరస్వామి సన్నిధికి 21వ సారి పాదయాత్ర చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో ప్రజలు, రైతులు సుఖ, సంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. కోడూరు నియోజకవర్గ పరిధిలో పాతయాత్రకు సహకరిస్తూ భక్తులకు, అన్ని సౌకర్యాలు కల్పిస్తూ, అన్నదానాలు చేస్తున్న స్థానిక ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, స్థానిక నాయకులకు ఆ వెంకటేశ్వరుని ఆశీస్సులు ఉంటాయని పేర్కొన్నారు. ఆయన వెంట డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డి, నాయకులు, భక్తులు పాదయాత్రలో పాల్గొన్నారు.

భక్తులకు సౌకర్యాలు కల్పించాలి

భక్తిభావంతో ఆకేపాడు నుంచి తిరుమలకు ప్రతి ఏడాది పాదయాత్ర చేయడం అమరన్నకు కలియుగ దైవం వెంకటేశ్వరస్వామి ఇచ్చిన వరమని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. ఇది సామాన్యులకు అయ్యేపని కాదని పేర్కొన్నారు. అలాగే ఆయన వెంట పాదయాత్రలో రాజంపేట, రైల్వేకోడూరులోని భక్తులు తిరుమలకు వేలాదిగా పాల్గొంటున్నారని అందువల్ల టీటీడీ అధికారులు భక్తులకు తగిన సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ముప్పాల హేమనవర్మ, తోట శివసాయి, చెవ్వు శ్రీనివాసులరెడ్డి, ఎల్వీ మోహన్ రెడ్డి, బండారు సుభద్రమ్మ, సుధాకర్‌రాజు, సీహెచ్ రమేష్, సిద్ధయ్య, లింగం లక్ష్మికర్, రామకృష్ణ, బుడుగు శివయ్య, నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న కొల్లం గంగిరెడ్డి

పాదయాత్రలో ఓబులవారిపల్లె నాయకులు..

ఓబులవారిపల్లె : జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి తిరుమల పాదయాత్రకు ఆదివారం రైల్వేకోడూరు మండలం బాలపల్లె వద్ద సింగల్ విండో మాజీ అధ్యక్షులు టంగుటూరు కృష్ణారెడ్డి స్వాగతం పలికారు. ఆకేపాటిని శాలువా పూలమాలతో సత్కరించి పాదయాత్ర బృందంతో కలసి తిరుమలకు బయలుదేరారు. కార్యక్రమంలో డీఆర్‌సీసీయూ మెంబర్ తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి, మారే సూకూమార్ తదితరులు పాల్గొన్నారు.

20న కారు వేలం

రామాపురం : అక్రమ మద్యం తరలిస్తున్న కేసులో పట్టుబడిన కారును ఈనెల 20వ తేదీ బుధవారం ఉదయం 10.30 గంటలకు వేలం వేస్తున్నట్లు మండల ఎస్ఐ కొండారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ వేలం కార్యక్రమం ఉంటుందన్నారు.

నివాళి



రామలక్ష్మమ్మకు నివాళి అర్పిస్తున్న ప్రభుత్వవిప్

ఓబులవారిపల్లె : కొర్లకుంట గ్రామ పంచాయతీ వార్డు మెంబర్ అక్కిరెడ్డి రామలక్ష్మమ్మ (68) ఆదివారం మృతి చెందారు. ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి రామలక్ష్మమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి సానుభూతిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీడీసీ వత్తలూరు రోహిణికుమార్‌రెడ్డి, జిల్లా టూరిజం డైరెక్టర్ జి.సుధాకర్‌రాజు, పార్టీ నాయకులు సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి



మృతి చెందిన ఫయాజ్

పెద్దతిప్పసముద్రం: మండలంలోని కందుకూరు పంచాయతీ అగ్రహారం వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఫయాజ్ (26) అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఎస్ఐ రవీంద్రబాబు కథనం మేరకు ములకలచెరువుకు చెందిన ఫయాజ్ ఓ ప్రైవేటు ఫైనాన్స్ కంపనీలో పని చేస్తూ విధుల్లో భాగంగా శనివారం కర్నాటక రాష్ట్రం చేలూరు నుంచి ములకలచెరువుకు ద్విచక్ర వాహనంలో వస్తుండగా అగ్రహారం వద్ద వాహనం బోల్తా పడి తీవ్రంగా గాయపడ్డాడు. అనంతరం మదనపల్లి జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఎస్ఐ రవీంద్ర బాబు తెలిపారు.

ఎస్టీయూకు నూతన మండల కార్యవర్గాలు



నందలూరు కార్యవర్గం



పుల్లంపేట: నూతనంగా ఎంపికైన ఎస్టీయూ మండల కార్యవర్గం



శివరామయ్య, పెనగలూరు



నాగరాజు, రాజంపేట

రాజంపేట టౌన్ : రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రాజంపేట శాఖ అధ్యక్షుడిగా జి.నాగరాజు ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని ఆయన ఆదివారం ఇక్కడి విలేకరులకు తెలిపారు. ఇటీవల పుల్లంపేటలో జరిగిన ఎస్టీయూ సమావేశంలో రాష్ట్ర నాయకుల ఆధ్వర్యంలో మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అందులో భాగంగా ప్రధాన కార్యదర్శిగా ఎం.చంద్రశేఖర్, ఆర్థిక కార్యదర్శిగా ఎం.శంకర్‌నాయక్‌లను ఎన్నుకున్నట్లు చెప్పారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

పెనగలూరు (ఓబులవారిపల్లె) : పుల్లంపేట మండలంలోని పుత్తనవారిపల్లి కెఎస్ఆర్ గార్డెన్స్‌లో ఆదివారం ఎస్టీయూ రీజనల్ సమావేశం జరిగింది. సమావేశం అనంతరం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పెనగలూరు మండలశాఖ అధ్యక్షుడిగా మన్నేరు శివరామయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శివరామయ్య మాట్లాడుతూ తనను అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు పెనగలూరు మండల ఎస్టీయూ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు.

పుల్లంపేట : రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఎస్టీయూ రాజంపేట రీజనల్ సమావేశం ఆదివారం పుత్తనవారిపల్లి గ్రామంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్టీయూ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎస్టీయూ మండలాధ్యక్షుడిగా సయ్యద్ సర్దార్ హుస్సేన్, ప్రధాన కార్యదర్శిగా సిద్దయ్య, ఆర్థిక కార్యదర్శిగా శివరాం, ప్రసాద్‌లను ఏకగ్రీవంగా ఎన్నుక్కునారు.

నందలూరు(రాజంపేట) : రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) ఆంధ్రప్రదేశ్, రాజంపేట రీజన్ సమావేశంలో మండల అధ్యక్షుడిగా షేక్ మహమ్మద్ షఫీవుల్లాను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా లీలా కృష్ణయ్య, ఆర్థిక కార్యదర్శిగా మార్కండేయ రెడ్డిలు ఎన్నికైనట్లు రాష్ట్ర కౌన్సిలర్ అల్లం అశోక్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా షఫీవుల్లా మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి తనకు అందజేసిన పదవికి వన్నెతెచ్చే విధంగా నడుచుకుంటానని, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో ముందుంటానన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు పాల్గొన్నారు.

అర్హులు సద్వినియోగం చేసుకోవాలి



పథకాలపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ

గాలివీడు : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ శేఖర్‌నాయక్ తెలిపారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా ఆదివారం వెలిగల్లు గ్రామంలో కేంద్ర పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలన్నింటిని గ్రామీణ ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రపై ప్రధాన మంత్రి మోడీ వర్చువల్ ద్వారా తెలియజేసిన సందేశాన్ని ప్రజలకు వీక్షించారు. కార్యక్రమంలో మండల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.